# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 29-11-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ఒడిశాలో జరుగుతున్న పోలీస్ ఉన్నతాధికారుల సదస్సులో పాల్గొనేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ సాయంత్రం భువనేశ్వర్ చేరుకున్నారు.
- భారత్.. ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించడానికి కేంద్ర బడ్జెట్ దోహదపడుతుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు.
- బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను భారత్ తీవ్రంగా పరిగణిస్తోందని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ అన్నారు.
- నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం రేపు మధ్యాహ్నం పుదుచ్చేరి సమీపంలో తీరాన్ని తాకే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది.

========================

భువనేశ్వర్‌లో 3 రోజుల పాటు జరగనున్న అఖిల భారత పోలీస్ డైరెక్టర్ జనరల్స్, ఇన్‌స్పెక్టర్ జనరల్స్ సదస్సులో పాల్గొనేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కొద్దిసేపటి క్రితం భువనేశ్వర్ చేరుకున్నారు. అక్కడ జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ... ఒడిశాలోని గిరిజనులు, రైతుల సంక్షేమం కోసం అనేక కీలక చర్యలు తీసుకున్నామని చెప్పారు. మహిళల అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వాలు పనిచేయడం వల్ల భారతీయ జనతా పార్టీ ఎన్నికల్లో విజయం సాధిస్తోందని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

(వాయిస్ 37 సెకన్లు)

కాగా... ఈరోజు నుంచి మూడు రోజుల పాటు జరగనున్న ఈ సదస్సులో తీవ్రవాదం, వామపక్ష తీవ్రవాదం, తీరప్రాంత భద్రత, నూతన నేర చట్టాలు, మాదక ద్రవ్యాలు సహా జాతీయ భద్రతకు సంబంధించిన కీలక అంశాలపై దృష్టి సారిస్తున్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, ప్రధానమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ పీకే మిశ్రా ఈ సదస్సులో పాల్గొంటున్నారు.

========================

కిసాన్ క్రెడిట్ కార్డ్ పథకాన్ని చేపల పెంపకం, పశుపోషణ, ఇతర రంగాలకు విస్తరించామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ఈరోజు బీహార్ లోని దర్భంగాలో జరిగిన క్రెడిట్ ఔట్‌రీచ్ కార్యక్రమంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ... మహిళా సాధికారతపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. రాబోయే సంవత్సరాల్లో భారత్.. ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించడానికి కేంద్ర బడ్జెట్ దోహదపడుతుందని చెప్పారు. డ్రోన్ దీదీ ప్రాజెక్టు... స్వయం సహాయక బృందాలను బలోపేతం చేయడంతో పాటు... శిక్షణ, నైపుణ్యాల మెరుగుదల అవకాశాలను అందిస్తుందని వివరించారు. కార్యక్రమంలో భాగంగా కేంద్ర మంత్రి.. వివిధ పథకాల కింద 49 వేల మంది లబ్ధిదారులకు సుమారు ఒక వెయ్యి 388 కోట్ల రూపాయల విలువైన రుణాలను అందజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న హింసాత్మక ఘటనలను భారత ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ అన్నారు. ఈరోజు లోక్‌సభలో ఆయన మాట్లాడుతూ... ఈ సంవత్సరం ఆగస్టులో బంగ్లాదేశ్‌లో ఇళ్లు, వ్యాపార సంస్థలు దోపిడీకి గురయ్యాయని, దేవాలయాలు, ఇతర ప్రార్థనా స్థలాలపై దాడులు జరిగాయని చెప్పారు. అలాగే... ఇటీవల బంగ్లాదేశ్‌లో జరిగిన పూజా ఉత్సవాల సందర్భంగా కూడా దేవాలయాలు, పూజా మండపాలపై దాడులు జరిగినట్లు నివేదికలు వెలుగు చూశాయన్నారు. ఈ ఏడాది దుర్గాపూజ సందర్భంగా ఢాకాలోని తాంతిబజార్‌లో పూజా మండపంపై దాడి, సత్ఖిరాలోని జోషేశ్వరి కాళి ఆలయంలో చోరీపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. బంగ్లాదేశ్ లోని మైనారిటీల పరిస్థితులను ఢాకాలోని భారత హైకమిషన్ నిరంతరం పర్యవేక్షిస్తోందని చెప్పారు. మైనారిటీలతో సహా బంగ్లాదేశ్ పౌరులందరి జీవితాలను, స్వేచ్ఛను రక్షించవలసిన బాధ్యత బంగ్లాదేశ్ ప్రభుత్వానిదని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం ప్రస్తుతం నాగపట్నానికి 300 కిలోమీటర్ల దూరంలోను, పుదుచ్చేరికి ఆగ్నేయంగా 340 కిలోమీటర్ల దూరంగాను, చెన్నైకి ఆగ్నేయంగా 380 కిటోమీటర్ల దూరంలోను ఉంది. ఈ అల్పపీడనం వచ్చే 6 గంటల్లో తుఫానుగా మారే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. ఇది ఉత్తర దిశగా కదిలి రేపు మధ్యాహ్నం పుదుచ్చేరి సమీపంలోని మహాబలిపురం, కారైకాల్ మధ్య తీరాన్ని తాకే అవకాశం ఉందని ఆ శాఖ వివరించింది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉత్తరప్రదేశ్ లోని సంభాల్‌లో జరిగిన హింసాకాండతో పాటు వివిధ అంశాలపై పార్లమెంటు సమావేశాలకు అంతరాయం కలిగించడంపై కేంద్ర మత్స్య శాఖ సహాయమంత్రి ఎస్.పి. సింగ్ బఘేల్... ప్రతిపక్షాలను ప్రశ్నించారు. పార్లమెంట్ వెలుపల ఆయన మీడియాతో మాట్లాడుతూ... కోర్టు ఆదేశాల మేరకు సర్వే బృందం మసీదు స్థలానికి చేరుకుందని, అయితే దుండగులు బృందం సభ్యుల పైనా, పోలీసులపైనా దాడి చేశారని చెప్పారు. ఈ అంశానికి సంబంధించి ఒక కమిటీని ఏర్పాటు చేశామని పేర్కొంటూ... దానికి మద్దతు ఇవ్వాలని కేంద్ర సహాయమంత్రి విజ్ఞప్తి చేశారు. కాగా... నిరసనల మధ్య పార్లమెంటు ఉభయ సభలు వాయిదా పడిన సందర్భంగా, కేంద్ర సహకార శాఖ సహాయ మంత్రి క్రిషన్ పాల్ గుర్జార్ మాట్లాడుతూ... ప్రతిపక్షాలు పార్లమెంటులో జరిగే చర్చల నుండి తప్పించుకుంటున్నాయని ఆరోపించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ పర్యాటక కేంద్రాలను ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేసేందుకు సుమారు 3 వేల 300 కోట్ల రూపాయల విలువైన 40 ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ప్రత్యేక సహాయం కింద... మూలధన పెట్టుబడి ప్రాజెక్టుల కోసం 50 సంవత్సరాల నిడివితో వడ్డీ లేని రుణంగా

కేంద్ర ప్రభుత్వం ఈ ఆర్థిక సహాయాన్ని అందజేస్తుంది. పర్యాటక ప్రదేశాల్లో మౌలిక వసతులను అభివృద్ధి చేయడం, సందర్శకులకు మంచి అనుభవాలను అందించేలా సౌకర్యాలు కల్పించడం, పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం వంటివి ఈ ప్రాజెక్టుల ద్వారా చేపడతారు. కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ఒక సామాజిక మాధ్యమం వేదికగా పేర్కొంటూ... ఈ ప్రాజెక్టులు దేశ పర్యాటక రంగానికి గొప్ప ప్రోత్సాహాన్ని ఇస్తాయన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ పోస్టుపై స్పందిస్తూ... పర్యాటక రంగం ఎంతోమంది జీవితాలకు మేలు చేస్తుందన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మైనారిటీల రక్షణ కోసం అన్ని చర్యలు తీసుకోవాలని భారత్... బంగ్లాదేశ్‌కు సూచించింది. విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఈరోజు న్యూఢిల్లీలో పాత్రికేయులతో మాట్లాడుతూ... హిందువులు, ఇతర మైనారిటీలను బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం రక్షించాలని, ఈ విషయంలో భారత్ వైఖరి స్పష్టంగా ఉందని పేర్కొన్నారు. బంగ్లాదేశ్‌లో జరుగుతున్న హింస, దాడుల పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇస్కాన్ సామాజిక సేవలో ప్రపంచ వ్యాప్తంగా మంచి గుర్తింపు పొందిన సంస్థ అని పేర్కొంటూ... చిన్మోయ్ కృష్ణ దాస్ అరెస్టుపై, చట్టపరమైన ప్రక్రియలు జరుగుతున్నాయని తెలిపారు. ఇవి పారదర్శకంగా, న్యాయంగా జరుగుతాయని ఆశిస్తున్నామని ఆయన చెప్పారు.

(వాయిస్ 31 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పూర్వ రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ జీవితం, ఆయన రచనలపై ప్రజలలో అవగాహన పెంపొందించవలసిన అవసరం ఉందని రాజ్యసభ డెప్యూటీ స్పీకర్ హరివంశ్ అభిప్రాయపడ్డారు. ఆకాశవాణి ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో నిర్వహించిన డాక్టర్ రాజేంద్రప్రసాద్ స్మారక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... దేశాభివృద్ధికి రాజేంద్ర ప్రసాద్ చేసిన కృషి ఎనలేనిదన్నారు. సమాజ శ్రేయస్సు కోసం ఆయన జీవన ప్రయాణంలో ఎన్నో అడ్డంకులను ఎదుర్కొన్నారని చెప్పారు. ప్రసాద్ భారతి సీఈవో గౌరవ్ ద్వివేది మాట్లాడుతూ... ఆకాశవాణి ప్రారంభమైనప్పటి నుండి, జాతికి స్వరంగా మారిందన్నారు. వార్తలను ప్రసారం చేస్తూ... కోట్లాది మందికి ఆసక్తికరమైన, నాణ్యమైన కార్యక్రమాలను ఆకాశవాణి అందజేస్తోందని పేర్కొన్నారు. పబ్లిక్ బ్రాడ్‌కాస్టర్‌గా ప్రసార భారతి పాత్ర మరింత విస్తృతమైందని తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్, శ్రీలంక దేశాల నావికాదళాలు ఈరోజు అరేబియా సముద్రంలో రెండు ఫిషింగ్ బోట్ల నుండి సుమారు 500 కిలోల బరువైన క్రిస్టల్ మెత్ అనే మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నాయి. సముద్రంలో ఉన్న బోటుల స్థానాన్ని గుర్తించడం, నిలువరించడానికి భారత నావికాదళం అత్యంత వేగంగా స్పందించిందని భారత నేవీ ఒక సామాజిక మాధ్యమం ద్వారా పేర్కొంది. రెండు పడవలు, సిబ్బందితో పాటు స్వాధీనం చేసుకున్న మాదక ద్రవ్యాలను తదుపరి చట్టపరమైన చర్యల కోసం శ్రీలంక అధికారులకు అప్పగించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =